రీతిగౌళ - ఆది

నాలం వాతవ - నయవచనం
చేలం త్యజతే - చేటీ భవామి

చల చల మమ సం - సర్ఘటనే కిం?
కులిశ హృదయ బహు - గుణ విభవ
పులకిత తను సం - భృత వేదనయా
మలినం వహామి - మదం త్యజామి

భజ భజ తేప్రియ - భామాం సతతం
సుజనస్త్వం నిజ - సుఖ నిలయ
భుజరేఖారతి - భోగి భవసికిం
విజయీభవ మ - ద్విధిం వదామి

నయనయ మామను - నయన విధంతే
ప్రియకాంతాయం - ప్రేమభవం
భయహర వేంకట - పతే త్వం మ
త్ప్రియోభవసి శో - భితా భవామి

ఈ సంకీర్తనలో నాయిక ఈర్ష్యాకషాయిత - కలహాంతరిత శ్రీవేంకటపతిపై ఆమె కు ప్రగాఢమైన ప్రణయ ప్రేమ. శ్రీవారు మాత్రం రాత్రి అంతా అన్య నాయికాసక్తి రక్తి కట్టించి వచ్చారు. నాయికను మరపించి మభ్యపెట్టే మాటలు మొదలు పెట్టినపుడు ఆమె సగం కరిగిన కోపంతో, సగం తరగని తాపంతో అన్న ఎత్తిపొడుపు పల్కులివి.

నీ కల్లబొల్లి కబుర్లు చాలవా ? నీకు దాస్యం చేస్తానుగాని నా కొంగు విడువు.

వజ్రంవలె కఠిన హృదయంగలవాడా ? దగ్గరగా వస్తావెందుకు ? పోపో దూరంగా పో. నీ కై ఎంత త్యాగం చేశాను నేను ? నీ గుణ సంపదలచే పులకరించి, చెమరించిన నా ఈ తనువు మలినమౌతున్నది.

మంచివాడవే ! వెళ్ళవయ్యా! వెళ్ళు ! నీ ప్రియభామనే ఏలుకో పో! నీవనుభవించిన సుఖానికి ఉనికి పట్టులైన నీ భుజముల మీద గుర్తులు (శంఖచక్ర సంజ్ఞలు) నీవు రతి

భోగివయ్యావని చాటుతున్నాయిలే. నీకు రతి భోగిత్వంలో విజయోస్తు! నీకు విజయమగుగాక! యివన్నీ యికనెందుకులే నా రాతను నేను నిందించుకోవలె. (నిన్నని ఏమి ప్రయోజనం ?)

తొలగు, తొలగు నన్ను ఊరడిద్దామని చేసే నీ ప్రయత్నం నీవంటే (గుడ్డి) ప్రేమ ఉన్న కాంతలకు నచ్చు బాటౌతుందేమోకాని ఈ నీ పప్పులు నా దగ్గర ఉడకవు. నీవు (యికముందైనా నీ అన్యభామాసక్తి త్యజించి) నాకే (నా ఒకర్తెకే) ప్రియుడవైతే మన ప్రేమ తేజోవం తమౌతుంది అంటున్న నాయిక మాటల్లో

హరిః ఓం సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై ఓం శాంతిశ్శాంతి

శ్శాంతిః అన్న వేదోక్త శాంతి మంత్రాన్ని పూలమాలలోని దారంవలె, పాలలో కరగిన పంచదారలా పరిఢవిల్లజేశారు పదక వితాపితామహులు. కలహాంతరిత శృంగారనాయికా కలహశాంతి మంత్ర సంకీర్తనమా ఇది ?